# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 308 | పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 5 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## కవితకు షాక్

**పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..**

**ఘాటుగా స్పందించిన కవిత**

**15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన**

**కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక.. కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత**

**హైదరాబాద్, జులై 4 (నమస్తే ఉదయం)**

కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయ-పోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం

..మిగతా 2లో

### ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క

# ఇవాళ పెద్ద వృక్షమైంది

## సీఎం రేవంత్ రెడ్డి

**మిడ్జిల్‌లో సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞత సభ**

**జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి సీఎం కృతజ్ఞతలు**

**తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సీఎం**

**హైదరాబాద్, జులై 4 (నమస్తే ఉదయం)**

2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు ఆశీర్వదించడంతో, ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందన్న సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ ప్రయాణం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డి పర్యటించారు. రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తి సందర్భంగా రేవంత్ కృతజ్ఞత సభ నిర్వహించారు. మిడ్జిల్‌లో కృతజ్ఞత సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంజనేయస్వామిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి : ముందుగా ఊర్కొండ చేరుకున్న

..మిగతా 2లో





**రంకెలు వేసినంత మాత్రాన..**

## అంకెలు మారవు

### హరీశ్‌రావు

**హైదరాబాద్, జులై 4 (నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ. 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ. 15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన

..మిగతా 2లో

## దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ

### ప్రారంభించి జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

**యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం.. ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి**

**అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం.. ప్రధాని మోడీ**



**జయపుర, జులై 4 (నమస్తే ఉదయం)**

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ. 1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను

..మిగతా 2లో

**బంగారంతో**

## లోదుస్తుల తయారీ

**ఇరాక్ ఎంపి అవినీతి బట్టబయలు**

**బాగ్దాద్, జులై 4 (నమస్తే ఉదయం)**

బాత్‌రూమ్‌లోని కమోడ్‌లను కూడా కొందరు సంపన్నులు బంగారంతో తయారు చేసుకున్న ఉదంతాలు మనకు తెలుసు. కానీ ఇరాక్‌లోని ఒక ఎంపీ ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు విలువైన వజ్రాలు, బంగారం, కట్టల కట్టల డబ్బు, ఖరీదైన వస్తువులు చూసి ఆశ్చర్యపోలేదు కానీ,

..మిగతా 2లో





### జులై 20 నుంచి పార్లమెంట్

# వర్షాకాల సమావేశాలు



**జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

**న్యూఢిల్లీ, జులై 4 (నమస్తే ఉదయం)**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే

..మిగతా 2లో

### ఇరాన్ సుప్రీం ఖమేనీ

## అంత్యక్రియలు ప్రారంభం

**భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి**



**టెహ్రాన్, జులై 4 (నమస్తే ఉదయం)**

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన

..మిగతా 2లో

### ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క

# ఇవాళ పెద్ద వృక్షమైంది: సీఎం రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిడ్జిల్, ఊర్కొండకు చెందిన నేతలు కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలు రేవంత్‌రెడ్డిని సన్మానించారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సీఎం ఊర్కొండలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఊర్కొండలో ఆంజనేయస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఆలయాన్ని దర్శించుకున్నారు. సీఎం, మంత్రులకు పూజారులు వేదాశ్వీరచనం, ప్రసాదాలు అందజేశారు. రూ. 10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనుచరులు, నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి : 20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది. జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా తన విజయానికి సహకరించిన వారిని కలిసిన సీఎం మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రేవంత్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు కార్యకర్తలు గుర్తు చేశారు.



# ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి...**

86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు



వస్తుందని ఎన్నడూ ఊహించ లేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉ ందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళులర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హుస్సైనీన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ

**మొదటి పేజీ తరువాయి...**

తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ. 75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు



ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ. 950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఆనంద్ కృష్ణారెడ్డి

**పటాన్ చెరు, జూలై 4 (నమస్తే ఉదయం):**

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి బిజెపి బొల్లారం పట్టణ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గతంలో బొల్లారం గ్రామపంచాయతీ, మున్సిపాలిటీగా ఉన్న కాలంలో కాలనీ ప్రజల కోసం ఎంతో సేవ చేసిన ఎస్సీ కాలనీకి చెందిన దివంగత యాదయ్య కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న విషయం గురించి తెలుసుకున్న ఆయన అండగా నిలిచారు. యాదయ్య మరణించినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు, పైగా అతని భార్య నాగమణికి కనీసం పింఛన్ కూడా రావడం లేదు. ఈ కష్టాల నడుమ యాదయ్య, నాగమణి దంపతుల కుమార్తె రాజేశ్వరికి ఇటీవల పెండ్లి నిశ్చయమైంది. తండ్రి లేని అమ్మాయి ఆర్థిక స్థోమత లేక ఆ కుటుంబం అయోమయ స్థితిలో పడిపోయింది. దీనిగురించి విషయం తెలుసుకున్న వెంటనే బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి స్వయంగా వారి ఇంటికి వెళ్లారు. పెద్దన్నలా నిలబడి పెళ్లికూతురు రాజేశ్వరికి పట్టుచీర అందించి, పదివేల రూపాయలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భరత్ చారి, రవీందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు అరుణ్, అంబుజపాల్, యువమోర్చా అధ్యక్షుడు యోగి తదితరులు పాల్గొన్నారు.






## జులై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల

# సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి...**

అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## రంకెలు వేసినంత మాత్రాన..

# అంకెలు మారవు

**మొదటి పేజీ తరువాయి...**

అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ. 4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది" అని విమర్శించారు.

# కవితకు షాక్

**మొదటి పేజీ తరువాయి...**

పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# బంగారంతో లోదుస్తుల తయారీ

**మొదటి పేజీ తరువాయి...**

బంగారంతో తయారు చేసిన ఖరీదైన లో దుస్తుల జతను చూసి షాక్ తిన్నారు. దీంతో ఈ బికినీ జత సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్న ఈ మహిళా ఎంపీ అలియా నస్ప్రీఫ్ ఇంటి నుంచి అధికారులు 1.33 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ. 148 కోట్లు నగదు, బంగారం, నగలు, వజ్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. భవనాలు, ఇతర ఆస్తులను కూడా ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పట్టుబడిన అక్రమ ఆస్తుల విలువ 8.5 కోట్ల డాలర్లు సుమారు రూ. 809 కోట్లు ఉంటుందని చెప్పారు.


# మధుబన్ కాలనీ నుండి ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీకి అప్రోచ్ రోడ్డు లేదు

**అక్రమ మార్గంగా అప్రోచ్ రోడ్డును రాకపోకలు సాగిస్తున్నారని జోనల్ కమిషనర్ కు కాలనీ అసోసియేషన్ ఫిర్యాదు**


**టౌన్ ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో విచారించమని జోనల్ కమిషనర్ ఆదేశాలు**

**అప్రోచ్ రోడ్డుతో భారీ వాహనాలు రాక పోకలు ప్రమాదాలతో మరణాలు: కాలనీ అసోసియేషన్ ఆవేదన**

**రాజేంద్రనగర్, జూలై 4 (నమస్తే ఉదయం)**



కాలనీలోకి భారీ వాహనాల ప్రవేశం




హుడ అనుమతి లే అవుట్ లో అప్రోచ్ రోడ్డు లేని దృశ్యం



భారీ వాహనాల రాకపోకల వల్ల మృతి చెందిన బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న మధువన్ కాలనీ అసోసియేషన్

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ మధుబన్ కాలనీ, ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీల మధ్య అప్రోచ్ రోడ్డు లేదని అక్రమంగా కాలనీలోకి రోడ్డును ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మధువన్ కాలనీ హుడా అనుమతి పొందిన లే అవుట్ అని ఈ లే అవుట్ కు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కి ఎలాంటి అప్రోచ్ రోడ్డు లేదని జోనల్ కమిషనర్ కు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు తమ స్వలాభం కోసం ఒక ప్లాటు యజమానిని ఒప్పించి ప్రత్యామ్నాయంగా మరొక ప్లాటు కాలనీలో ఇచ్చి ప్లాట్లు రోడ్డుగా చూపిస్తున్నారని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కి మా కాలనీ ద్వారా అప్రోచ్ రోడ్డు (అనుసంధానం) ను ఏర్పాటు చేయటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని వివరించారు. కొన్ని నెలల క్రితం ఒక భారీ వాహనం ఢీకొట్టడం వల్ల చిన్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ ప్లాట్లు రెసిడెన్షియల్ గా ఉన్నప్పటికీ భారీ షెడ్లు నిర్మించి కమర్షియల్ ప్లాట్లుగా మార్చారని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. షెడ్లు నిర్మించటం వల్ల వ్యాపార కార్యకలాపాల కోసం భారీ వాహనాలు తమ కాలనీ గుండా రాకపోకలు సాగిస్తున్నారని దీంతో కాలనీవాసులు ప్రమాదాల బారిన పడుతున్నారని గుర్తు చేశారు. మధుబన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ నుండి రాకపోకలు సాగించకుండా పెద్ద బండరాలను అడ్డంగా ఏర్పాటు చేశామని తెలియజేశారు. అందుకు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో ఈ విషయంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భారీ వాహనాల నుండి తమకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని దీంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరారు.



దేవాలయ భూమిలో షెడ్డు వేస్తుండగా గోడ కు నోటీసు అంటించిన దేవాదాయ శాఖ సిబ్బంది

# దేవాలయ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దు

**బుద్వేల్, జూలై 4 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ శ్రీ సీతారామచంద్ర స్వామీ దేవాలయం భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండగా స్పందించిన దేవదాయ శాఖ అధికారులు సదరు నిర్మాణాలను ఆపడానికి దేవదాయ శాఖ అధికారులు ప్రయత్నించారు. శనివారం నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నిం చారు. నోటీసులు తీసుకోవడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో నోటీసులను గోడకు అంటించారు. ఆ విషయమై శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయం ఈఓ శ్రీకాంత్ మాట్లాడుతూ, దేవాలయ భూముల్లో అక్రమంగా షెడ్డు వేస్తున్నారని, ఆ భూమికి సంబందించి ఎలాంటి ఆధారాలు చూపకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రాంబాగ్ రామాలయం పరిసర ప్రాంతాలలో ఎవరు నిర్మాణాలు చేపట్టవద్దన్నారు.

**వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల అభినందనలు :**

నూతన రకాలను కనుగొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను అంతకు ముందు వర్సిటీ లో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ నర్సిం హ్మారావు, విత్తన జాయింట్ డైరెక్టర్ సుచరిత, వ్యవసాయ విశ్వవిద్యాలయ విత్తన డైరెక్టర్ డాక్టర్ నగేశ్, తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ దృవీకరణ సంస్థ డైరెక్టర్ కిరణ్, కేంద్ర ప్రభుత్వ విత్తన విడుదల డిప్యూటీ కమిషనర్ బినోద్ గోరి, రాష్ట్ర ఉద్యానవన పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ లు అభినందించారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దండ రాజి రెడ్డి

# వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే విధంగా శాస్త్రవేత్తలు ముందుకు సాగాలి.

**బుద్వేల్, జూలై 4 (నమస్తే ఉదయం)**

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి రైతుల అవసరాలను తగ్గట్లు ప్రాంతానుకూల సాంకేతికతలను కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వేగంగా క్షేత్ర స్థాయి కి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధన సంస్థ జోన్ - 10 హైదరాబాద్ ఆధ్వర్యంలో 2026-27 కు సంబంధించిన వార్షిక కార్యచరణ ప్రణాళిక కార్యక్రమం పై రాజేం ద్రనగర్ లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల లో శనివారం నిర్వహించారు.వ్యవసాయరంగం నేడు వాతావరణ మార్పులు, నీటి కొరత, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. వాటిని అధిగమించడానికి శాస్త్రవేత్తలు ఆలోచనలు చేయాలన్నారు. రాజేంద్రనగర్ లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి మాట్లాడుతూ, వాతావరణ మార్పులను తట్టుకునే చిరుధాన్యాల సాగును విస్తరించడంతో పాటు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులను, పోషకాహార భద్రత, మహిళా సాధికారతకు దోహదపడే కార్యక్రమాలను కృషి విజ్ఞాన కేంద్రాలు చేపట్టాలన్నారు. వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధన సంస్థ జోన్ - 10 హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ, ప్రతి కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ఆధారాలతో వార్షిక కార్యచరణ ప్రణాళికను రూపొందించాలనిసూచించారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ టి సురేశ్ కుమార్, డాక్టర్ ఎం యాకాద్రి, డాక్టర్ ఎం కిషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్



ఆశ చూపే ప్రకటనలను నమ్మవద్దని బ్రోచర్ లను చూపుతున్న పోలీసులు

# సైబర్ క్రైం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**బుద్వేల్, జూలై 4 (నమస్తే ఉదయం)**

స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ నకిలీ యాప్స్, పార్ట్ టైమ్ జాబ్స్ ఇప్పిస్తామని మోసం చేసే వారు, డిజిటల్ అరెస్ట్ అంటు భయపెట్టేవారి పట్ల ఉద్యోగులు, సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. రాజేంద్రనగర్ లోని తెలంగాణ రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (టీజీఐఆర్డీ) లో శిక్షణ కోసం వచ్చిన 520 మంది గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ రంగాల కు చెందిన ఉద్యోగులకు రాజేం ద్రనగర్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం సైబర్ క్రైం వల్ల ఎలా మోసపోతారో అని వివరిస్తు అవగాహన డయల్ చేసి కల్పించారు. ఆన్లైన్ మోసాలకు గురైనామని అనుమానం కలిగితే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. మీకు లోన్లు వచ్చాయని, మీకు బహుమతులు వచ్చాయని ఎవరైన చెపితే మోసపోవద్దన్నారు. సోషల్ మీడియా లో వచ్చేవన్ని నిజమని నమ్మవద్దన్నారు. డిజిటల్ పేమెంట్స్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉచితాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్, ఎస్ఐఐ ఎస్ మల్లేశం, రాజేంద్రనగర్ జోనల్ సైబర్ సెల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జూలై 4(నమస్తే ఉదయం)**



గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో డి టి ఆర్ ఏర్పాటు నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి హర్షవర్ధన్ తెలిపారు. ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు గగన్‌పహాడ్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన గ్రీన్ సిటీ, జల్పల్లి, శివాజీ నగర్లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




# సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

**త్యాగం, పోరాట స్ఫూర్తి బావి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుంది**

**రాజేంద్రనగర్, జూలై 4 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం జంట నగరాల అధ్యక్షులు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. శనివారం కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య బి ఆర్ ఎస్ నాయకులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ… భూస్వామ్య దోపిడీకి, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, రైతాంగ హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు.ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి బావి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుంది అని అన్నారు."త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత… వారి ఆశయాల సాధనకు కృషి చేయడం మన కర్తవ్యం." అని తెలిపారు.ఈ కార్యక్రమం లో శ్రీను ,ఉప్పల్ ఆనంద్, రామస్వామి, శంకర్, రాజకుమార్, రవి మూర్తి, రఘు ,జి రాజ్ కుమార్, బొద్రాయి శివ ,సాయి ,మొగ్లి, భాగ్యమ్మ, రిషి, శివ ,మురళి, కిష్టమ్మ, శరణమ్మ, లక్ష్మ , హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం సభ్యులు పాల్గొన్నారు

# అల్లాబండ రిజర్వాయర్ పరిధిలో నీటి సరఫరా అంతరాయం

**హైదరాబాద్, జూలై 4 (నమస్తే ఉదయం)**

జలమండలి పరిధిలోని గోల్కొండ జోన్, గోషామహల్ సర్కిల్‌లోని అల్లాబండ రిజర్వాయర్ వద్ద 10 ఎంఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్ ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లకు అమర్చిన బటర్‌ఫ్లై వాల్వ్‌ల వద్ద భారీ లీకేజీలు ఏర్పడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త వాల్వ్‌లను అమర్చే పనులు చేపట్టనున్నారు. ఈ పనులను సోమవారం 06 వ తేదీన ఉదయం 6:00 గంటల నుంచి మంగళవారం 7 తేదీన ఉదయం 6:00 గంటల వరకు చేపట్టనున్నారు. ఈ కారణంగా క్రింది ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

**6 తేదీన ప్రభావిత ప్రాంతాలు:**

జిర్రా, ఇందిరానగర్, హరి దర్గా, కుమ్మరవాడి, టప్పాచబుత్రా, ఆకాశ్‌పురి, షిబ్లీ హిల్స్, బిలాల్ మసీదు పరిసరాలు, గోడేకి కబర్, జాలి, హనుమాన్, జంగూర్ బస్తీ, అబూషటాకియా, 2జే బస్ స్టాప్, జియాగూడ, కార్వాన్.

**ఈనెల 7వ తేదీన ప్రభావిత ప్రాంతాలు:**

సబ్జిమండి, గంగానగర్, ఉస్మానియా, శివలాల్ నగర్, బెర్హాం గల్లి, గంగామాత, జాలి హనుమాన్, ఆజం గల్లి, రహీంపురా, పురానాపూల్, చుడీ బజార్, ఉస్మానియా ఆసుపత్రి పరిసరాలు, శంకర్ బజార్, జుమ్మెరాత్ బజార్. అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరడమైనది.




# గద్వాలలో రైతులకు ఉచితంగా పత్తి విత్తనాల పంపిణీ

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**గద్వాల ప్రతినిధి, జూలై 4 (నమస్తే ఉదయం)**

రైతు సంక్షేమమే ధ్యేయంగా గద్వాల జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో గద్వాల డివిజన్‌కు చెందిన రైతులకు 'కపాస్ క్రాంతి' పత్తి విత్తనాల ప్యాకెట్లను శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతన్నలకు సకాలంలో నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకుని రైతులు మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ నాగేష్,మాజీ సర్పంచులు వాసు, విజమ్ భాస్కర్ రెడ్డి, నాయకులు వెంకటన్న, మహేశ్వర్ రెడ్డి, అధికారులు, నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు..



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి కి వినతి పత్రం తో పాటు మొక్కను బహుకరిస్తున్న టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్

# కలెక్టర్ గారు.... మైలార్దేవుపల్లి డివిజన్‌లో ఒక సారి పర్యటించి మా సమస్యలు పరిష్కరించండి

**టీడీపీ నేత ఉస్కేమూరి విజయ్ కుమార్**

**బుద్వేల్, జూలై 4 (నమస్తే ఉదయం)**

మైలార్ దేవుపల్లి డివిజన్ లో ఒక సారి పర్యటించండి సారు..... అంటు టీడీపీ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. మైలార్ దేవుపల్లి డివిజన్ లో సరైన రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ కాలువలు రోడ్లపైన పొంగి పారుతుండటం, రోడ్లపై చెత్త చెదారంతో నిండి కనిపించడం, చెరువుల్లో కలుషిత, మురుగునీరు చేరడం లాంటి సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ గా మీరు ఒక్క సారి వస్తే మా సమస్యలు దూరమౌతాయని విన్నవించుకున్నారు. ఇందిరమ్మ క్యాంటీన్ ల వద్ద షెడ్డు లేకపోవడంతో భోజనం చేసే పేదలు వర్షం లో తడుస్తు, ఎండలో ఎండుతు తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. శ్రీరాం కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ మురుగునీరు మధుబన్ కాలనీ చెరువులో కలుస్తుండటంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఎర్రకుంట, కొత్త చెరువు, పల్లె చెరువు లు కూడా కలుషితమైపోయాయన్నారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కారం కావాలంటే కలెక్టర్ రావాలని మెజారిటీ బస్తీలు, కాలనీల ప్రజలు కోరుకుంటున్నారని విజయ్ కుమార్ గుర్తు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో 12 రకాల వంగడాలను కనుగొన్న శాస్త్రవేత్తలు

**రాజేంద్రనగర్, జూలై 4 (నమస్తే ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కనుగొన్న 12 రకాల వండడాలను శనివారం రాజేంద్రనగర్ కిద్వాయ్ కాటేజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, నూతన వంగడాలను కనుగొన్న శాస్త్రవేత్తలతో కలసి వివరాలను ప్రకటించారు. వరంగల్ లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ గా పనిచేస్తున్న డాక్టర్ ప్రశాంత్ బృందం ఆధ్వర్యంలో డబ్ల్యుజీసీవీ బీటీ-28 మొట్టమొదటి బీటీ పత్తి రకం అని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య గుర్తు చేశారు. ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్టు, కాటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెరైటీ ఐడేంటిఫికేషన్ కమిటీ దక్షిణ మండలంలో సాగునీటి పరిస్థితులకు అనుకూమైన రకం గా గుర్తించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హర్షం వ్యక్తం చేశారు. అదే విదంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన 11 నూతన వంగడాలను విడుదల చేయడం కోసం జూన్ 2వ తేదీన రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పంట రకాల విడుదల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో అగ్రి వర్సిటీ ప్రతిపాదించిన నూతన రకాల విడుదల కు ఆమోదం తెలిపిందన్నారు. వీటిలో పంటల వారిగా చూసినట్లయితే వరి లో ఆరు రకాలు, మొక్క జొన్న, సోయ చిక్కుడు, కంది, పెసర, మినుము పంటలలో ఒక్కొక్కటి చొప్పున అధిక దిగుబడి చీడ పీడలను తట్టుకునే రకాలను రాష్ట్ర స్థాయిలో సాగు నిమిత్తం అధికారులకు విడుదలకు సిఫారుసు చేయబడ్డాయన్నారు. ఈ సందర్భంగా నూతన రకాలను రూపొందించిన వ్యవసాయ శాస్త్రవేత్తలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# కరుణించని వానదేవుడు

**కాన రాని కృష్ణమ్మ**

**నాడు గల గల... నేడు వెలవెల**

**నిండుకోని కర్ణాటక జలశయాలు**

**జూరాలకు కరువైన వరద**

**ఆందోళనలో ఆయకట్టు రైతు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 4(నమస్తే ఉదయం)**

ఆకాశం వైపు చూస్తే నల్లని మబ్బులు కమ్ముకుంటున్నాయే తప్ప, ఆశించిన వాన కురవడం లేదు. వానదేవుడు కరుణించకపోవడంతో కృష్ణమ్మ ఉధృతి ఎక్కడా కానరావడం లేదు. నాడు జలకళతో, వరద హోరుతో 'గలగల'లాడిన కృష్ణా తీరం.. నేడు నీరు లేక 'వెలవెల'బోతోంది. ఎగువన ఉన్న కర్ణాటక జలాశయాలు నిండకపోవడం, జూరాలకు వరద కనుమరుగవ్వడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అంతటా ఆయకట్టు రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా జూన్, జూలై నెలలు వచ్చాయంటే కృష్ణమ్మ పరవళ్లు తొక్కాలి. ఎగువ ఉన్న కర్ణాటక జలాశయాల నుంచి వచ్చే వరద నీటితో జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయాలి. కానీ, ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నాడు జలకళతో గలగలా పారిన జూరాల ప్రాజెక్టు, నేడు నీరు లేక వెలవెలబోతోంది. కృష్ణానదిపై తెలంగాణలో ఉన్న మొదటి ప్రధాన ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాలకు వరద కనుమరుగవ్వడం ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగాన్ని తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. ప్రకృతి కరుణించి, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడితేనే జూరాల మళ్లీ 'గలగల'లాడే పరిస్థితి రాదని, అప్పటి వరకు జూరాల వద్ద కృష్ణమ్మ మూగబోతుంది.



**ఆశలు.. కానీ అంతా జాప్యం!**

జూరాల ప్రాజెక్టుకు ప్రధాన నీటి వనరు ఎగువన ఉన్న కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు. ఎగువ మహారాష్ట్ర, కర్ణాటక పరివాహక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురవకపోవడంతో ఆ ప్రాజెక్టుల్లోకి ఇంకా ఆశించిన స్థాయిలో వరద చేరలేదు. దీనికి తోడు, అక్కడి జలాశయాలు పూర్తిగా నిండితే తప్ప దిగువకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి కర్ణాటక నుంచి నీటి విడుదల తీవ్రంగా జాప్యం అవుతుండటంతో జూరాల ప్రాజెక్టు అడుగంటుతోంది.

**నాడు వరద ప్రవాహం**

గత యేడాది జూన్ మాసంలోనే జూరాల ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతూ దిగువన ఉన్న శ్రీశైలానికి ఉరకలేసింది. కాని ఈ యేడాది ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో తెలంగాణలో దాదాపు 210 కి.మీ. మేర ప్రవహిస్తున్న కృష్ణానదిలో రాళ్లు రప్పలే కనిపిస్తున్నాయి. తెలంగాణ పరిధిలో ఉన్న జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండాలంటే కర్ణాటక జళాశయాలు అల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు పూర్తి స్థాయిలో నిండి దిగువకు నీటిని విడుదల చేస్తే కాని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు జలకళ సంతరించుకునే పరిస్థితి.

**ఎండిపోతున్న నదీ గర్భం.. కనుమరుగైన వరద**

గత ఏడాది జూలై మొదటి వారానికి కృష్ణమ్మ పరవళ్లతో వరద ఉధృతితో మునిగితేలిన జూరాల, ఇప్పుడు నీటి సామర్థ్యం నిల్వలు రోజు రోజుకు పడిపోతున్నాయి. జూరాల ప్రాజెక్టు మీద ఆదారపడిన కుడి, ఎడుమ కాలువలకు సాగు నీరందించే పరిస్థితి లేకపోతుంది. గత యేడాది జూలై మొదటి వారంలో జూరాల ప్రాజెక్టులో నీడి నిల్వలు పూర్తిస్థాయిలో ఉండటంతో దాదాపు లక్ష క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. ఈ యేడాది వరద రాకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు పడిపోతున్నాయి.

**ఆందోళనలో ఆయకట్టు రైతాంగం**

జూరాల ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వలతో పాటు సమాంతర కాల్వలు, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ఎత్తిపోతల పథకాల కింద లక్షలాది ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది.

నార్లు పోసి ఎదురుచూపులు: వర్షాకాలం ప్రారంభం కాగానే ఉత్సాహంగా నార్లు పోసుకున్న రైతులు ఇప్పుడు నీరు లేక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసిన రైతులు.. కృష్ణనదికి వరద రాకపోవడంతో ఆయకట్టు కింద వేసిన పంటలు చేతికి వస్తాయా లేదా అనే భయంలో ఉన్నారు.

**నిపుణుల మాట:**

"ఎగువన పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురిస్తేనే కృష్ణా నదికి పూర్వవైభవం వస్తుంది. కర్ణాటక జలాశయాలు నిండి, వారు దిగువకు నీటిని విడుదల చేసే వరకు జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతులు నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలి. ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి."




## రైతు భరోసాకు కొత్తవారు దరఖాస్తు చేసుకోవాలి: ఏవో రాజ వర్ధన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 4 (నమస్తే ఉదయం)**


కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం కేటిదొడ్డి మండలం కుచినెర్ల, ఉమిత్యాల మండలంలో రైతుల నుంచి రైతు భరోసా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు మాత్రమే ఇందుకు అర్హులని పేర్కొ న్నారు. అర్హులైన రైతులు తమ పరిధిలోని వ్యవ సాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని వివరించారు. దరఖాస్తుతో పా టు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీలను రైతు భరోసా దరఖాస్తు ఫారం జత చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు జూలై 5వ తేదీ చివరి గడువని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఇఈలు కిరణ్ కుమార్, దీపక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ జోగుళాంబ దేవి అమ్మవారికి బంగారు పూతతో కూడిన ప్రత్యేక చీర (కవచం)ను అందజేసిన భక్తుడు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 4 (నమస్తే ఉదయం)**



అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగుళాంబ దేవి అమ్మవారికి హైదరాబాద్ కు చెందిన తీగల క్రాంతి కిరణ్ రెడ్డి అనే భక్తుడు అమ్మవారిపై గల భక్తి శ్రద్ధలతో రాగి లోహంపై బంగారు పూతతో కూడిన ప్రత్యేక చీర (కవచం)ను శనివారం ఆలయ ఈఓ దీప్తికి అందజేశారు. మొత్తం 13 భాగాలతో సుందరంగా రూపుదిద్దుకున్న ఈ విశేష కవచం (చీర) విలువ సుమారు రూ. రూ.9,27,000 ఉంటుందని దాత తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. అమ్మవారికి ఇంతటి విశిష్టమైన కానుకను అందించిన దాత తీగల క్రాంతి కిరణ్ రెడ్డి కి ఆలయ బోర్డు తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. దాత కోరిన ప్రత్యేక రోజున (వారికి ఇష్టమైన పర్వదినాన) ఈ బంగారు పూత చీరతో శ్రీ జోగుళాంబా అమ్మవారికి విశేష అలంకరణ చేయబడుతుందని ఈవో వెల్లడించారు.



## ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కుక్కల క్రాంతి ముదిరాజ్

**పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ**

**కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన క్రాంతి ముదిరాజ్**

**కూకట్ పల్లి, జూలై 4 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కుక్కల క్రాంతి ముదిరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘం చైర్మన్ బండి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతి ముదిరాజ్ మాట్లాడుతూ, ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పదవిని కేవలం హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన బండి రమేష్ నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని, ఆయన మార్గదర్శకత్వంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ డివిజన్‌లో ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదు, ఇంటింటి ప్రచారం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, యువత, మహిళలను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించే కార్యక్రమాలతో ఫతేనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన వెల్లడించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేస్తే కాంగ్రెస్ విజయపథంలో ముందుకు సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో ప్రోటోకాల్ కన్వీనర్ సూరజ్ తివారీ, నర్సింగ్ రావు, కుమార్ స్వామి, వరలస్వామి, మద్దూరి రాము, మద్దూరి కిరణ్, చిటకోరు నరి, అమీద్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని క్రాంతి ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఫతేనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో కుక్కల క్రాంతి ముదిరాజ్ సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడగా, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.



## ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలి

**ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి హక్కు**

**ప్రగతి నగర్ వన్ బస్తీ అధ్యక్షుడు మాచర్ల విష్ణు**

**కూకట్ పల్లి, జూలై 4 (నమస్తే ఉదయం)**

ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో ప్రగతి నగర్ లో బూతులు 604,605,606 లలో జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, బి ఎల్ ఓ లు సరిత, అరుంధతి, సునీత, బిల్ కలెక్టర్ రమేష్ లతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం-6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ కి సూచించారు. అనంతరం మాచర్ల విష్ణు మాట్లాడుతూ18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం-6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఈ బాధ్యతను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

## పోలీసులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన సదస్సు

**స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, పొదుపు, పెట్టుబడులపై సూచనలు**

**సైబర్ మోసాల బారిన పడొద్దన్న బాలానగర్ ఏసిపి నరసింహారెడ్డి**

**కూకట్ పల్లి, జూలై 4 (నమస్తే ఉదయం)**



కూకట్‌పల్లి ఎన్ కెఎన్ఆర్ గార్డెన్స్ లో పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఆర్థిక నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలానగర్ డీసీపీ రితీరాజ్ సూచన మేరకు కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీ నర్సింహారెడ్డి, ఆర్థిక నిపుణుడు శ్రీధర్ రావు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందికి స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక మోసాల నివారణపై వారు అవగాహన కల్పించారు. జీతంలో కొంత భాగాన్ని తప్పనిసరిగా పొదుపు చేయాలని, అనవసర అప్పులు, అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే బ్యాంకు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ సదస్సులో కూకట్‌పల్లి, బాలానగర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లు, డి ఐలు, ఎస్సై లు, బాలానగర్ డివిజన్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, ఏ ఆర్ ఫోర్స్ కు చెందిన 125 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి వంగవీటి మోహనరంగ

**వంగవీటి మోహనరంగ జయంతి సందర్బంగా**

**నివాళ్ళు అర్పించిన జిల్లా గణేష్ నేత**

**కూకట్ పల్లి, జూలై 4 (నమస్తే ఉదయం)**




ఉమ్మాడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ప్రముఖ నాయకుడిగా పేరుగాంచిన వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా శనివారం ఆల్విన్ డివిజన్ ఎల్లమ్మబండలో వంగవీటి మోహన్ రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ తోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత కార్యకర్తలతో కలిసి ఆయనకు నివాళ్లు అర్పించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేసి పేదల సంక్షేమం, భూమి పట్టాల పంపిణీ, ప్రజల సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టి, ప్రజా సమస్యలు తీర్చి ప్రజల కోసం బ్రతికిన గొప్ప నాయకుడు వంగవీటి రంగా అని అన్నారు. జయంతి, వర్ధంతి ప్రతి సంవత్సరం అనేక మంది అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సత్యనారాయణ, రూబెన్, రెహన్, సీనియర్ నాయకులు, మహిళలు, కాలనీవాసులు, అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

# గద్వాల సబ్ రిజిష్టర్ కార్యాలయంలో సాక్షుల దందా

**ప్లాట్ల క్రయవిక్రయాల్లో తిష్టవేసిన మధ్యవర్తులు**

**రోజుకు పదికి పైగా సాక్షి సంతకాలు పెడుతున్న వైనం**

**రిజిస్ట్రేషన్ల శాఖ నిబంధనలు బేఖాతరు..**

**నకిలీ సాక్షులపై చర్యలకు డిమాండ్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 4(నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. భూములు, ప్లాట్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలకమైన 'సాక్షి సంతకాలు' ఇప్పుడు బహిరంగంగానే విక్రయ వస్తువులుగా మారిపోయాయి. కార్యాలయం ఆవరణలో తిష్టవేసిన కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు సాక్షులు"గా అవతారమెత్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు.

**అంగట్లో సాక్షులు.. ఒక్కొక్కరికి రేటు**

నిజానికి రిజిస్ట్రేషన్ సమయంలో కొనేవారికి, అమ్మేవారికి ఇరుపక్షాల తరఫున తెలిసిన వ్యక్తులు, నమ్మకస్తులు సాక్షులుగా సంతకాలు చేయాలి. కానీ గద్వాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో కథ




వేరుగా ఉంది. ప్లాట్లు, స్థలాల క్రయవిక్రయదారులతో ఎలాంటి పరిచయం లేకపోయినా, అసలు ఆ భూమి ఎక్కడుందో తెలియకపోయినా.. కేవలం డబ్బుల కోసం సాక్షి సంతకాలు పెట్టే ముఠాలు ఇక్కడ తయారయ్యాయి. కొంతమంది మధ్యవర్తులు ఒక్కో సంతకానికి ఇంత అని రేటు ఫిక్స్ చేసి, కొనుగోలుదారుల నుంచి వసూలు చేస్తూ ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

**రోజుకు పది సాక్షి సంతకాలు!**

కార్యాలయం చుట్టూ తిరిగే కొద్దిమంది వ్యక్తులే రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే వేర్వేరు రిజిస్ట్రేషన్లలో సాక్షులుగా మారుతుండటం గమనార్హం. ఒక్కొక్కరు రోజుకు పదికి పైగా డాక్యుమెంట్లపై సాక్షి సంతకాలు పెడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి డాక్యుమెంట్‌కు ఆధార్ కార్డు, వేలిముద్రలు సేకరిస్తున్నప్పటికీ, ఒకే వ్యక్తి రోజూ ఇన్ని సంతకాలు పెడుతుంటే అధికారులు ఎలా చూస్తూ ఊరుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**భవిష్యత్తులో తీవ్ర వివాదాలకు దారితీసే ప్రమాదం:**

ఈ సాక్షుల వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తినప్పుడు అసలైన కొనుగోలుదారులు, అమ్మకందారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చినప్పుడు ఈ నకిలీ సాక్షులు ఆ దస్తావేజులను నిరూపించలేరని, దీనివల్ల అమాయక ప్రజలు మోసపోతారని మేధావులు హెచ్చరిస్తున్నారు. గద్వాల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సాగుతున్న ఈ ' సాక్షుల' దందాపై రిజిస్ట్రేషన్ అధికారులు తక్షణమే స్పందించాలని, రోజువారీ రిజిస్ట్రేషన్లలో ఒకే వ్యక్తి పదే పదే సాక్షిగా రాకుండా ఆధార్ డేటా ఆధారంగా కఠిన నిబంధనలు అమలు చేయాలని, ఈ అక్రమాలకు పాల్పడుతున్న మధ్యవర్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు